‘అల్ఫోర్స్’ విద్యార్థుల ప్రతిభ

విద్యార్థిని అభినందిస్తున్న అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వీ నరేందర్‌రెడ్డి

కరీంనగర్ కమాన్‌చౌరస్తా, జూన్ 24 : ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాల్లో అల్ఫోర్స్ విద్యార్థులు అఖండ విజయం సాధించారు. ఈ విషయాన్ని విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వీ నరేందర్‌రెడ్డి తెలిపారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని కళాశాల ప్రాంగణంలో సోమవారం ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బైపీసీ విభాగంలో జే అంజన 440కి 439 మార్కులు సాధించి రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. అలాగే, ఎంపీసీ విభాగంలో 30 మంది విద్యార్థులు 470 మార్కులకు 468 మార్కులతో అద్భుత విజయం సాధించారని సంతోషం వ్యక్తం చేశారు. ఇంతే కాకుండా 81 మంది విద్యార్థులు 467 మార్కులు, 131 మంది విద్యార్థులు 466 మార్కులతో అల్ఫోర్స్‌ను అగ్రస్థానంలో నిలిపారన్నారు. అలాగే, బైపీసీలో రాష్ట్రస్థాయి మార్కులు సాధించడంతోపాటు నలుగురు 438 మార్కులు, 14 మంది 437, 34 మంది 436 మార్కులు సాధించారని, ఎంఈసీలో టీ అఖిల్, వీ రిషిత, ఎం శ్రీవల్లిక పటేల్ 500 మార్కులకు 494 మార్కులు సాధించి రాష్ట్రంలో అత్యుత్తమ స్థానంలో నిలిచారని చెప్పారు. సీఈసీలో విభాగంలో బీ గ్రీష్మ, సీహెచ్ నిఖిత 500 మార్కులకు 494 మార్కులు సాధించారని తెలిపారు. పటిష్ట ప్రణాళికతో విద్యాబోధన, నిరంతర పర్యవేక్షణ, విద్యార్థుల అహర్నిశల కృషితోనే ఇంతటి ఘనవిజయం సాధ్యమైందని వివరించారు.

కలెక్టర్ పమేలా సత్పతి బదిలీ రద్దు

కరీంనగర్ కలెక్టరేట్, జూన్ 24 : కరీంనగర్ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న పమేలా సత్పతి బదిలీని రద్దు చేయడంతో పాటు తిరిగి జిల్లాలోనే కొనసాగిస్తూ ఉత్తర్వులు విడుదలయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సోమవారం ఉదయం 44 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేయగా, వీరిలో కరీంనగర్ కలెక్టర్ ఇక్కడే కొనసాగేలా ఆదేశాలు జారీ చేశారు. పది రోజుల క్రితం రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టర్ల ట్రాన్స్‌ఫర్లు భారీగా జరిగాయి. వీరిలో కరీంనగర్ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న పమేలా సత్పతిని కూడా ఉన్నారు. కాగా, ఆమె స్థానంలో సిరిసిల్ల కలెక్టర్ అనురాగ్ జయంతిని బదిలీ చేశారు. అయితే, ఆయన జిల్లాలో పనిచేసేందుకు ఆసక్తి కనబర్చలేదని తెలుస్తున్నది. తాజాగా జరిగిన బదిలీల్లో అనురాగ్ జయంతిని గ్రేటర్ హైదరాబాద్ జోనల్ కమిషనర్‌గా నియమించారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న డబుల్ బెడ్రూం లబ్ధిదారులు

మా ఇండ్లు మాకు ఇవ్వాలె

- పెద్దపల్లి కలెక్టరేట్ ఎదుట రామగుండం మండల డబుల్‌బెడ్రూం లబ్ధిదారుల ధర్నా

పెద్దపల్లి టౌన్, జూన్ 24: ‘లక్కీ డ్రాలో వచ్చిన మా ఇండ్లు మాకు వెంటనే ఇవ్వాలి’ అని రామగుండం మండల డబుల్‌బెడ్రూం లబ్ధిదారులు ఆందోళన చేశారు. సోమవారం పెద్దపల్లి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో మోసపూరిత వాగ్దానాలు ఇచ్చి ఏ ఒక్కటీ అమలు చేయకుండా కాంగ్రెస్ సర్కారు తమను నిండా ముంచిందని వాపోయారు. తమకు ఇండ్లు ఇస్తామని మోసం చేసిందని మండిపడ్డారు. గత కలెక్టర్ ఆదేశాల మేరకు రామగుండం తహసీల్దార్ డబుల్ బెడ్రూం ఇండ్ల కోసం లక్కీ డ్రా ద్వారా 660 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారని చెప్పారు. ఎంపికై రోజులు గడుస్తున్నా డబుల్ బెడ్రూం ఇండ్లు తమకు అప్పగించడం లేదని, అధికారులను అడిగితే సమాధానం దాటవేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం తమకు కేటాయించిన గృహాలను వెంటనే అందజేయాలని కోరుతూ కలెక్టరేట్‌లో ప్రజావాణిలో దరఖాస్తు అందజేశారు. సమ్మయ్య, జమీర్, దేవేందర్, రాజేశ్,గోపి, మాధవి, చాయ,సూజాత, అనురాధ సహ పెద్ద సంఖ్యలో లబ్ధిదారులు ఉన్నారు.

గంజాయి మత్తు యువత భవిత చిత్తు

- కట్టడి చేస్తున్నా గుట్టుగా సరఫరా
- ఇటీవల జరిగిన అఘాయిత్యాలు, ఆత్మహత్యలకు ఇదే కారణం
- పోలీసుల చేతిలో గంజాయి గుట్టు
- ఇప్పటికే పలువురి విచారణ, కౌన్సెలింగ్

గంజాయి గుప్పుమంటున్నది. బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాల్సిన వయసులో యువత మత్తులో జోగుతున్నది. కన్నవారి కలలను కల్లలు చేస్తూ జీవితాన్నే నాశనం చేసుకుంటున్నది. పోలీసులు ఎంత కట్టడి చేస్తున్నా, గుట్టుగా విక్రయాలు జరుగుతుండగా, ఈ మత్తు అనేక అఘాయిత్యాలు, ఆత్మహత్యలకు కారణంగా నిలుస్తున్నది. ఇటీవల మంథని ప్రాంతానికి చెందిన ఇద్దరు యువకుల మృతికి, ఓ వివాహిత ఆత్మహత్యకు, అలాగే రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి లైంగికదాడి హత్య ఘటనకు ఈ డ్రగ్గే కారణమనే చర్చ జరుగుతున్నది. ఇటీవల సరఫరా చేస్తున్న యువకుల అరెస్ట్‌తో విక్రేతలు, సేవించేవారి గుట్టు పోలీసుల చేతికి చేరిందని, ఇప్పటికే 30 మంది విద్యార్థులు, యువకులను మంథని విచారించి కౌన్సెలింగ్ నిర్వహించినట్లు తెలిసింది.

- పెద్దపల్లి, జూన్ 24(నమస్తే తెలంగాణ)

పట్టుబడ్డ గంజాయిని చూపుతున్న పోలీసులు(ఫైల్)

గంజాయి గుప్పుమంటున్నది. రోజురోజుకూ దందా జోరుగా సాగుతున్నది. ప్రభుత్వం మాదక ద్రవ్యాల నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నప్పటికీ రహస్య మార్గాల ద్వారా యువతకు అందుబాటులోకి వస్తుండగా, యువత బానిసలవుతున్న తీరు కలవరపెడుతున్నది. ఈ మాయదారి మత్తుకు యువకులు వికృతంగా ప్రవరిస్తున్నారు. అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు.

మంథని కేంద్రంగా దందా..

మంథని కేంద్రంగానే దందా జోరుగా సాగుతున్నది. ఇందుకు ఇటీవల గంజాయి, దాని అనుబంధ కేసుల నమోదే నిదర్శనంగా నిలుస్తున్నది. అంతే కాదు ఇటీవల మంథని ప్రాంతంలో ఒక నాయకుడికి సరఫరా చేసేందుకు గంజాయిని తీసుకొస్తున్న ఇద్దరు యువకులను మంథని బస్ డిపో ఏరియాలో పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. వారి వద్ద దాదాపు కిలో సరుకు దొరకడం ఇక్కడ దందా జరుగుతున్న తీరుకు అద్దంపడుతున్నది.

పోలీసుల చేతిలో గుట్టు..

మంథని ప్రాంతంలో గంజాయి విక్రయిస్తున్న, సేవిస్తున్న వారి పూర్తి వివరాలు మంథని పోలీసుల చేతికి చిక్కాయి. నిందితులను అరెస్టు చేసిన సమయంలో వారి నుంచి స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్ల ఆధారంగా ఎవరెవరు ఎప్పుడెప్పుడు గంజాయిని తీసుకు వచ్చి విక్రయించారు.? ఎవరెవరు కొనుగోలు చేశారనే సంభాషణలు పూర్తిగా కోడ్ భాషలో నిక్షిప్తమై ఉండడాన్ని గుర్తించారు. ఈ కేసు ఆధారంగా ఇప్పటికే దాదాపు 30 మంది వరకు విద్యార్థులు, యువతను మంథని పోలీసులు విచారించి కౌన్సెలింగ్ నిర్వహించినట్లు తెలుస్తోంది. పిల్లలు గంజాయి వాడుతున్న విషయాన్ని తల్లిదండ్రులకు సైతం తెలియజేసి వారిని గంజాయికి దూరంగా ఉంచేందుకు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించినట్లు తెలిసింది.

వరుస నేరాలకు గంజాయే కారణం..

రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి చిన్నారిపై లైంగికదాడి, హత్య ఘటనకు సైతం గంజాయే కారణమైంది. బిహార్‌కు చెందిన ఓ కార్మికుడు గంజాయి మత్తులో ఈ దారుణానికి ఒడిగట్టినట్లు తెలిసింది. అలాగే, మంథని ప్రాంతంలోని ఎరుకలగూడెంలో ఓ యువకుడు ఒక్కసారిగా గంజాయికి దూరమై అనారోగ్యం బారినపడి మృతిచెందాడు. వారం వ్యవధిలోనే శ్రీపాదకాలనీకి చెందిన మరో యువకుడు సైతం రెండు కిడ్నీలు చెడిపోయి మృత్యువాతపడ్డాడు. ఇక 20 రోజుల క్రితం మంథనిలో ఓ వివాహిత మహిళ సైతం ఆత్మహత్య చేసుకోవడానికి గంజాయే కారణమనే జోరుగా చర్చ జరిగింది.

ఉక్కుపాదం మోపుతున్నాం..

ప్రభుత్వం మాదక ద్రవ్యాల సరఫరా, వినియోగంపై కఠిన చర్యలకు ఉపక్రమించింది. రామగుండం సీపీ శ్రీనివాస్ ఆదేశాల మేరకు జిల్లాలో గంజాయి నియంత్రణకు పకడ్బందీ చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే పలు చోట్ల విక్రయదారులు, వినియోగదారులపై కేసులు నమోదు చేశాం. ఇప్పటి వరకు గంజాయికి సంబంధించిన ఏ కేసులో రాజకీయ నాయకులకు సంబంధాలున్నట్లుగా మా దృష్టికి రాలేదు. ఎక్కడైనా గంజాయి వినియోగం, విక్రయానికి సంబంధించి ఎలాంటి సమాచారమైనా ఉంటే ప్రజలు తమ దృష్టికి తెస్తే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతాం.

- మడత రమేశ్, ఏసీపీ, గోదావరిఖని

ప్రేమను ఒప్పుకోరని..

పెంటం చందు

- ప్రేమిజంట ఆత్మహత్యాయత్నం
- యువకుడు మృతి.. చికిత్స పొందుతున్న యువతి

కరీంనగర్ రాంనగర్/ ముస్తాబాద్, జూన్ 24: తమ ప్రేమను పెద్దలు ఒప్పుకోరనే ఆందోళనతో ఓ ప్రేమ జంట ఆత్మహత్యకు యత్నించింది. యువకుడు చనిపోగా, యువతి చికిత్స పొందుతున్నది. కరీంనగర్ వన్ టౌన్ పోలీసుల వివరాల ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం గూడెం గ్రామానికి చెందిన పెంటం చందు(23) చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయాడు. అప్పటి నుంచి నానమ్మతో కలిసి ఉంటూ అదే గ్రామంలో హార్వెస్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఓ వ్యక్తి వద్ద కొద్దికాలం డ్రైవర్‌గా పనిచేశాడు. ఆ సమయంలోనే సదరు వ్యక్తి కూతురు (19)తో ఏర్పడ్డ పరిచయం ప్రేమగా మారింది. ఇద్దరూ కొన్నేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ప్రస్తుతం ఆ యువతి కరీంనగర్‌లో డిగ్రీ చదువుతుండగా, ఆదివారం ఉజ్వల పార్కు సమీపంలో కలుసుకున్నారు. మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో పురుగుల మందు తాగారు. గమనించిన ఓ హోటల్ యజమాని ఆ ఇద్దరిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఈ క్రమంలోనే చందు ఫోన్ నుంచి చందుకు వరుసకు సోదరుడైన నవీన్‌కు ఆ యువతి ఫోన్ చేసి, తమ ప్రేమను పెద్దలు ఒప్పుకోరని, అందుకే విషం తాగామని చెప్పింది. ఇటు యువతి తల్లిదండ్రులకు కూడా విషయం తెలియడంతో వెంటనే కరీంనగర్‌కు చేరుకున్నారు. యువతిని మెరుగైన చికిత్స కోసం ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. చందును కూడా ప్రైవేట్ దవాఖానకు తరలించగా అప్పటికే పరిస్థితి విషమించి సోమవారం ఉదయం మృతి చెందాడు. చందు సోదరుడు నవీన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు సీఐ సరిలాల్ తెలిపారు.

ఎంసెట్‌లో క్వాలిఫై అయి..

సాక్షి (ఫైల్)

సిరిసిల్ల రూరల్, జూన్ 24: ఎంసెట్ ఎంట్రెన్స్‌లో క్వాలిఫై అయి, సెకండియర్ మ్యాథ్స్‌లో ఫెయిలై ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నది. కుటుంసభ్యుల కథనం ప్రకారం.. తంగళ్లపల్లికి చెందిన తోకల రవి-లక్ష్మి దంపతులకు కూతురు సాక్షి(17) అలియాస్ సోని, కొడుకు ఉన్నారు. సాక్షి మండెపల్లి శివారులోని మోడల్ స్కూల్‌లో ఇంటర్ ఇటీవలే పూర్తి చేసింది. ఎంసెట్ ఎంట్రన్స్ రాసి, క్వాలిఫై అయింది. అయితే ఇంటర్ సెకండియర్ మ్యాథ్స్ సబ్జెక్టులో ఫెయిలైంది. సప్లిమెంటరీ రాసింది. సోమవారం వచ్చిన ఫలితాల్లోనూ ఫెయిలైంది. తీవ్ర మనస్తాపానికి లోనై, ఉరేసుకున్నది. కుటుంబ సభ్యులు గమనించి సిరిసిల్ల ప్రభుత్వ దవాఖానకు తరలించగా, అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. తండ్రి రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

గత ప్రభుత్వ విధానాలే..

- వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ఎంఎస్ఎంఈ పాలసీ
- రాష్ట్ర ఐటీ మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్, జూన్ 24(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన విధానాలను యథావిధిగా కొనసాగిస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ‘ఎంఎస్ఎంఈ-సమ్మిళిత అభివృద్ధి’ అనే అంశంపై నిర్వహించిన సదస్సులో శ్రీధర్‌బాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...‘ప్రభుత్వాలు వస్తుంటాయ్.. పోతుంటాయ్, కానీ అభివృద్ధి ఆగకూడదు.. పారిశ్రామికాభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఇందులో భాగంగా గత సర్కారు ప్రవేశపెట్టిన వివిధ పాలసీలను కొనసాగిస్తాం’అని పేర్కొన్నారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ఎంఎస్ఎంఈ పాలసీని ప్రవేశపెట్టనున్నట్లు, దీంతో దేశంలోనే మొదటి ఎంఎస్ఎంఈ పాలసీ తెచ్చిన రాష్ట్రంగా తెలంగాణ నిలువనున్నదన్నారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టనున్న కొత్త ఎంఎస్ఎంఈ పాలసీ రూపకల్పన జరుగుతున్నదని, దీనిపై సూచనలు, సలహాలు ఇవ్వాలని పరిశ్రమ వర్గాలను కోరారు. పరిశ్రమకు నైపుణ్యంగల ఉద్యోగుల అవసరం ఎంతో ఉందని, ఇందుకు అనుగుణంగా నైపుణ్యాలను అభివృద్ధి చేసేందుకు త్వరలోనే ఐఎస్‌బీ తరహాలో స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

మూడు నెలల్లో నైనీలో బొగ్గు ఉత్పత్తి

- సింగరేణి సీఎండీ ఎన్ బలరాం వెల్లడి



హైదరాబాద్, జూన్ 24 (నమస్తే తెలంగాణ) : అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న ఒడిశాలోని నైనీ కోల్ బ్లాక్ నుంచి ఈ సెప్టెంబర్ చివరికల్లా బొగ్గు ఉత్పత్తిని ప్రారంభించాలని సింగరేణి సంస్థ లక్ష్యంగా పెట్టుకున్నది. నైనీకి 50 కిలోమీటర్ల దూరంలోనే 1,600 మెగావాట్ల థర్మల్ విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాన్ని కూడా సంస్థ నిర్మించనున్నది. ఈ థర్మల్ ప్లాంట్ నిర్మాణానికి అనువైన స్థలంతోపాటు కీలకమైన భూసేకరణ సమస్యను పరిష్కరించేందుకు సింగరేణి సంస్థ సీఎండీ ఎన్ బలరాం సోమవారం ఒడిశాలో పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ కుమార్‌జెనాతో ప్రత్యేకంగా భేటి అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నైనీ కోల్‌బ్లాక్‌కు ఇప్పటికే అన్ని అనుమతులు లభించాయని, రెండో దశ అటవీ అనుమతుల కోసం నిబంధనలను పాటిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కోరినట్లుగానే రూ.180 కోట్లు చెల్లించామని, వన్యప్రాణి నిర్వహణ ప్రణాళికలో భాగంగా మరో రూ. 39 కోట్లు డిపాజిట్ చేశామన్నారు. ప్రాజెక్ట్ ప్రారంభం కోసం 783 హెక్టార్ల అటవీభూమిని తమకు బదలాయించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. నైనీ బొగ్గు గని నుంచి ఉత్పత్తికి అన్ని రకాలుగా సహకరిస్తామని ఒడిశా సీఎస్ హామీనిచ్చారు.

4,800 కోట్ల నుంచి సున్నాకు

బైజూస్‌లో పెట్టుబడులను రైటాఫ్ చేసిన ప్రోసస్

న్యూఢిల్లీ, జూన్ 24: డచ్‌కి చెందిన పెట్టుబడుల సంస్థ ప్రోసస్ నిండా మునిగింది. బైజూస్‌లో పెట్టిన 578 మిలియన్ డాలర్ల(రూ.4,800 కోట్ల) పెట్టుబడులను రైటాఫ్ చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ ఎడ్యుటెక్ సంస్థ బైజూస్‌లో గతంలో 9.6 శాతం వాటా కలిగివున్నది. ప్రస్తుతం ఈ వాటాను సాంకేతికంగా రద్దు చేసుకుంటున్నట్లు తెలిపింది. దీంతో సంస్థకు రూ.4,800 కోట్ల భారీ నష్టం వాటిల్లింది. ఈ విషయాన్ని నెదర్లాండ్ స్టాక్ ఎక్స్చేంజ్‌లకు సమాచారం అందించింది. బైజూస్‌లో ఈక్విటీ ఇన్వెస్టర్ల వాటాల విలువ భారీగా క్షీణించిన నేపథ్యంలో రైటాఫ్ నిర్ణయం తీసుకున్నామని ప్రోసస్ వెల్లడించింది. దీంతో 2024 ఆర్థిక సంవత్సరంలో సంస్థ 493 మిలియన్ డాలర్ల నష్టం వాటిల్లింది. రైట్స్ ఇష్యూకి ముందు బైజూస్‌లో 9.6 శాతం వాటా ఉందని పేర్కొంది. కంపెనీ ఆర్థిక పరిస్థితులు, అప్పులు, భవిష్యత్తు అంచనాలకు తమవద్ద ఎలాంటి సమాచారం లేకపోవడంతో బైజూస్ కంపెనీ విలువను సున్నాకు తగ్గిస్తున్నట్లు ప్రోసస్ ప్రతినిధి ఒకరు తెలిపారు.

వాణిజ్య

కిర్రాక్ ఐపీవో షో

జనవరి మొదలు పబ్లిక్ ఇష్యూకు 37 సంస్థలు • 32,000 కోట్ల సమీకరణ • 17 ఏండ్లలో ఇదే అత్యుత్తమ రికార్డు

ముంబై, జూన్ 24: ఈ ఏడాది సెకండరీ మార్కెటే కాదు.. ప్రైమరీ మార్కెట్ కూడా దుమ్మురేపింది. బీఎస్ఈ ప్రధాన సూచీ సెన్సెక్స్, ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీలు సరికొత్త స్థాయిల్లో కదలాడుతున్నాయి. మరోవైపు స్టాక్ మార్కెట్లలోకి రికార్డు స్థాయిలో ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్లు (ఐపీవో) వచ్చేస్తున్నాయి. ఎంతలా అంటే గడిచిన 17 ఏండ్లలో ఇదే అత్యుత్తమ ప్రథమార్ధం (జనవరి-జూన్)గా నిలిచింది. ఈ ఏడాది జనవరి మొదలు ఇప్పటిదాకా 37 సంస్థలు పబ్లిక్ ఇష్యూకు వచ్చాయి. ఇందులో కో-వర్కింగ్ స్పేస్, ఫర్నీచర్ రిటైలింగ్, ఆన్‌లైన్ టికెట్ బుకింగ్ వంటి కంపెనీలూ ఉండటం విశేషం. ఇవన్నీ కలిసి దాదాపు రూ.32,000 కోట్ల నిధులను సమీకరించడం గమనార్హం. ఈ వారంలోనే మూడు ఐపీవోలు ముగిశాయి.

2007 తర్వాత..

2007 ప్రథమార్ధంలో గరిష్ఠంగా 54 సంస్థలు దేశీయ స్టాక్ మార్కెట్లలోకి ఐపీవోల ద్వారా ప్రవేశించాయి. నాడు అవి సమీకరించిన నిధులు రూ.20,833 కోట్లు. మళ్లీ ఆ తర్వాత ఇప్పుడే ఆ స్థాయిలో కంపెనీలు ఈక్విటీ మార్కెట్లలోకి వచ్చాయి. అయితే 2022 జనవరి-జూన్‌లో 16 సంస్థలే వచ్చినా రూ.40,311 కోట్ల నిధుల సమీకరణ జరిగింది. ప్రభుత్వ జీవిత బీమా దిగ్గజం ఎల్ఐసీ ఐపీవో కలిసొచ్చింది. ఈ ఒక్క పబ్లిక్ ఇష్యూ విలువే రూ.21,000 కోట్లు. ఇది గనుక లేకపోతే ఐపీవో మార్కెట్‌లో 6 నెలల్లో సమీకరించిన నిధులపరంగా ఈ ఏడాదే అత్యుత్తమం. ఇక గత ఏడాది ప్రథమార్ధంతో పోల్చితే ఈ ఏడాది ఫండింగ్ నాలుగు రెట్లు ఎగిసింది. దేశ, విదేశీ మదుపరుల మద్దతే ఇందుకు కారణం. స్టాక్ మార్కెట్ల రికార్డు లాభాలూ కారణమే. ఈ లాభాలకు ఆకర్షితులయ్యే మరిన్ని సంస్థలు ఐపీవోలకు సిద్ధమైనట్టు మార్కెట్ నిపుణులు తాజా ట్రెండ్‌ను విశ్లేషిస్తున్నారు. పైగా గతంలో పార్లమెంట్ ఎన్నికలు జరిగిన ఏ ఏడాది ప్రథమార్ధంలోనూ ఈసారి నమోదైన దాంట్లో నాల్గో వంతు కూడా పబ్లిక్ ఇష్యూలు, నిధుల సమీకరణ జరుగలేదు.

క్యూలో మరికొన్ని..

హ్యుందాయ్ ఇండియా, స్విగ్గీ, ఓలా తదితర ప్రముఖ సంస్థలన్నీ ఐపీవోలకు క్యూ కట్టాయి. ఇందులో హ్యుందాయ్ పబ్లిక్ ఇష్యూ దేశ స్టాక్ మార్కెట్ల చరిత్రలోనే అతిపెద్దది కానుండటం గమనార్హం. ప్రస్తుతం ఎల్ఐసీ పేరిట ఉన్న భారీ ఐపీవో రికార్డూ చెరిగిపోనున్నది. అయితే వచ్చే నెల రాబోయే కేంద్ర బడ్జెట్.. ఐపీవోల దూకుడుకు కాస్త బ్రేకులు వేయవచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కాగా, ఈ ఏడాదిలో ఇప్పటిదాకా సెన్సెక్స్ 6.8 శాతం, నిఫ్టీ 8.1 శాతం పుంజుకున్నాయి. ఇక 20 శాతానికిపైగా నిఫ్టీ మిడ్‌క్యాప్ 100, 20.5 శాతం మేర స్మాల్‌క్యాప్ 100 పెరిగాయి. స్టాక్ మార్కెట్లలో కొత్తగా లిస్టింగైన కంపెనీలూ.. మదుపరులకు ఆకర్షణీయ రాబడులనే అందిస్తున్నాయి. బీఎస్ఈ ఐపీవో సూచీ ఈ ఏడాది 21.8 శాతం ఎగబాకింది. నిధుల సమీకరణలో ఆర్థిక రంగ సంస్థలదే నాల్గో వంతు (రూ.7,879 కోట్లు) వాటాగా ఉన్నది.

దేశీయ సంస్థలు, కుటుంబ వ్యాపారస్తులు, అపర కుబేరుల (హెచ్ఎన్ఐ) వద్ద కావాల్సినంత నగదు నిల్వలున్నాయి. దీంతో పబ్లిక్ ఇష్యూలకు విశేష ఆదరణ లభిస్తున్నది. దీన్నిచూసి మరిన్ని సంస్థలు ఐపీవోలకు క్యూ కడుతున్నాయి. ఈ ఏడాది ఇలాగే సాగితే సరికొత్త రికార్డులు ఖాయం.

- చిరాగ్ నేగంది, జేఎం ఫైనాన్షియల్ ఎండీ

- **చివరిసారిగా లోక్‌సభ ఎన్నికలు జరిగిన 2019 ప్రథమార్ధంలో 8 ఐపీవోలే వచ్చాయి. వాటి విలువ రూ.5,509 కోట్లు.**
- **2014 జనవరి-జూన్‌లో ఒక్క ఇనీషియల్ పబ్లిక్ ఆఫరే వచ్చింది.**
- **2009 తొలి అర్ధ భాగంలో రెండు ఐపీవోలు రాగా, వీటి విలువ రూ.302 కోట్లు.**
- **భారతీయ స్టాక్ మార్కెట్లలోకి ఈ ఏడాదిలో ఇప్పటిదాకా మ్యూచువల్ ఫండ్స్ ద్వారా వచ్చిన నిధులు రూ.1.85 లక్షల కోట్లపైనే.**
- **విదేశీ మదుపరులు వెనక్కి తగ్గారేమోగానీ.. దేశీయ మదుపరులు మాత్రం సై.**
- **ఈ జనవరి-జూన్‌లో వచ్చిన భారీ ఐపీవో భారతీ హెక్సాకామ్. దీని విలువ రూ.4,275 కోట్లు. ఆ తర్వాత ఆధార్ హౌజింగ్ ఫైనాన్స్ (రూ.3,000 కోట్లు).**
- **ఈ ఏడాది వచ్చిన అతిచిన్న ఐపీవో విభోర్ స్టీల్ ట్యూబ్స్. విలువ రూ.72 కోట్లు.**
- **నిరుడు ప్రథమార్ధంలో సగటు డీల్ పరిమాణం రూ.896 కోట్లు. ఈసారి రూ.859 కోట్లు.**

హీరో బైకులు ప్రియం

న్యూఢిల్లీ, జూన్ 24: ప్రముఖ ద్విచక్ర వాహన సంస్థ హీరో మోటోకార్ప్ వాహన కొనుగోలుదారులకు షాకిచ్చింది. వచ్చే నెల 1 నుంచి అమలులోకి వచ్చేలా ఎంపిక చేసిన మాడళ్ల ధరలను రూ.1,500 వరకు పెంచుతూ సోమవారం నిర్ణయం తీసుకున్నది. ఉత్పత్తి వ్యయం పెరగడం వల్లనే కొన్ని మాడళ్ల ధరలను పెంచాల్సి వచ్చిందని కంపెనీ వర్గాలు వెల్లడించాయి.

తగ్గిన పసిడి రిజర్వులు

న్యూఢిల్లీ, జూన్ 24: విదేశాల్లో రిజర్వు బ్యాంక్ వద్ద ఉన్న బంగారం నిల్వలు తగ్గుముఖం పట్టాయి. మార్చి 2024 నాటికి గోల్డ్ రిజర్వులు 47 శాతం వరకు తగ్గాయి. 2017 తర్వాత ఇదే కనిష్ఠ స్థాయి కావడం విశేషం. విదేశాల్లో ఉన్న బంగారం నిల్వలను దేశానికి తరలిస్తుండటం ఇందుకు కారణం. దేశ వ్యాప్తంగా బంగారం రిజర్వులు సెప్టెంబర్ 2021లో 39 శాతంగా ఉండగా, మార్చి 2024 నాటికి ఇవి 53 శాతానికి ఎగబాకాయి. ప్రస్తుతం ఆర్బీఐ వద్ద 822.1 టన్నుల బంగారం ఉంది.

పన్ను రిబేటు పెంచాలి

- ఉద్యోగుల కోసం ట్రేడ్ యూనియన్ల డిమాండ్
- పాత పెన్షన్ పథకాన్నే అమలు చేయాలి
- కేంద్ర ఆర్థిక మంత్రితో ముందస్తు బడ్జెట్ చర్చలు

బడ్జెట్ (2024-25)

న్యూఢిల్లీ, జూన్ 24: వేతన జీవుల కోసం పన్ను రిబేటును పెంచాలని ట్రేడ్ యూనియన్లు కోరుతున్నాయి. ముందస్తు బడ్జెట్ సమావేశాల్లో భాగంగా సోమవారం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో వివిధ వాణిజ్య, వర్తక సంఘాల నాయకులు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు తమ జీతం, గ్రాట్యుటీలపై ఇప్పుడున్న ఆదాయ పన్ను (ఐటీ) రిబేటు సీలింగ్ పరిమితిని భారీగా పెంచాలన్నారు. అలాగే 8వ వేతన సంఘాన్ని ఏర్పాటు చేయాలని, కొత్త పెన్షన్ స్కీం (ఎన్‌పీఎస్)ను రద్దుచేసి.. పాత పెన్షన్ పథకాన్ని (ఓపీఎస్) పునరుద్ధరించాలన్న తదితర డిమాండ్లనూ మంత్రి వద్ద వినిపించారు. వచ్చే నెల పార్లమెంట్‌లో నిర్మలా సీతారామన్ ఈ ఆర్థిక సంవత్సరానికి (2024-25)గాను పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టబోతున్నారన్నది తెలిసిందే.

ప్రైవేటీకరణ వద్దు

ప్రభుత్వ రంగ సంస్థ (పీఎస్‌యూ)ల ప్రైవేటీకరణను కేంద్రం ఆపాలని కూడా ఈ సందర్భంగా ట్రేడ్ యూనియన్లు విజ్ఞప్తి చేశాయి. ఏటా పెద్ద ఎత్తున పీఎస్‌యూల్లో వాటాలను ఉపసంహరిస్తున్న మోదీ సర్కారు.. అందు కోసం లక్ష్యాలను పెట్టుకొనిమరీ ముందుకెళ్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఎయిర్ ఇండియా వంటి సంస్థలను ప్రైవేట్ సంస్థలకు అమ్మేసిన సంగతి విదితమే. కాగా, అసంఘటిత రంగ కార్మికులు, వ్యవసాయ కూలీల కోసం ఓ సామాజిక భద్రతా నిధిని ప్రభుత్వమే ఏర్పాటు చేయాలని, నెలనెలా కనీసం రూ.9,000 పెన్షన్‌తోపాటు ఇతరత్రా వైద్య, విద్య ప్రయోజనాలను దానిద్వారా అందించాలని కూడా తమ మెమరాండంలో మంత్రికి యూనియన్లు సూచించాయి.

ఈవీలపై జీఎస్టీ హేతుబద్ధం చేయాలి

విద్యుత్తు ఆధారిత వాహనాల (ఈవీ)పై జీఎస్టీ రేట్లను హేతుబద్ధీకరించాలని ఆటో కంపోనెంట్స్ ఇండస్ట్రీ సంఘం (ఏసీఎంఏ) కేంద్ర ఆర్థిక, భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖలకు సమర్పించిన సిఫార్సుల్లో కోరింది. అలాగే పెట్టుబడులకు ప్రోత్సాహకాలు కల్పించాలని, ప్లాంట్-మెషినరీలపై డిప్రిషియేషన్ రేట్లు 15 నుంచి 25 శాతానికి పెంచాలని సూచించింది. ఐటీ చట్టంలోని సెక్షన్ 194ఆర్ కింద వ్యాపార ప్రయోజనాలపై పన్ను కోతలపైనా ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేసింది. కస్టమ్స్ చట్టాల కింద వారసత్వ వివాదాల పరిష్కారార్థం ఆమ్నెస్టీ స్కీంను తేవాలని ఏసీఎంఏ అధ్యక్షుడు శ్రద్ధా సూరీ మార్వా అన్నారు.

నేటి నుంచి స్పెక్ట్రం వేలం

న్యూఢిల్లీ, జూన్ 24: స్పెక్ట్రం వేలానికి మళ్లీ వేళాయింది. రూ.96 వేల కోట్ల విలువైన వాయుతరంగాలను మంగళవారం నుంచి విక్రయించనున్నారు. 5జీ మొబైల్ సర్వీసులు అందించడానికి సిద్ధమవుతున్న టెలికం దిగ్గజాలైన రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియాలు ఈ వేలంలో పాల్గొనబోతున్నాయి.

అమర రాజాతో జీఐబీ ఎనర్జీ

న్యూఢిల్లీ, జూన్ 24: జీఐబీ ఎనర్జీ ఎక్స్ స్లోవాకియాతో ఒప్పందాన్ని కుదుర్చుకున్నది అమర రాజా అడ్వాన్స్‌డ్ సెల్ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్. ఇరు సంస్థల మధ్య కుదిరిన ఒప్పందంతో జీఐబీ ఎనర్జీ ఎక్స్‌కి చెందిన సబ్సిడరీ సంస్థ గోటియాన్ హై-టెక్ కో లిమిటెడ్ లిథియం-అయాన్ సెల్ టెక్నాలజీ పంచుకోనున్నాయి. దీంతో అమర రాజా ప్రపంచస్థాయి ఎల్ఎఫ్‌పీ సెల్స్‌ను తయారు చేయడానికి వీలు పడనున్నది.